క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ రాఘవేంద్ర ఫీడర్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కోత ఉంటుందన్నారు. ఫీడర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

వినూత్నంగా స్నేహితుల దినోత్సవం



మొక్కలు నాటుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ బండిగోపాల్‌యాదవ్

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడలో జియో లైఫ్ ఫౌండేషన్, మారుతి కిసాన్ ఏజెన్సీ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, కిసాన్ ఏజెన్సీ నిర్వాహకులు మహిపాల్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



సమగ్రశిక్ష అభియాన్ రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ

శంషాబాద్: సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లా నూతన కమిటీని పట్టణంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజీజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా.. మహిళా అధ్యక్షురాలిగా శ్రీలత, ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి సాయి, గౌరవ అధ్యక్షులుగా బుచ్చయ్యలను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ. సమగ్ర శిక్ష అభియాన్‌లో గత పన్నెండేళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులపై వివక్షత చూపుతోందని ఆరోపించారు.

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నేతలు

గోల్కొండ: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌ని కార్వాన్ బీజేపీ నాయకులు ఆదివారం కలిశారు. ప్రధాని నరేంద్రమోదీ చిత్రం ఉన్న జ్ఞాపికను ఆయనకు అందజేశారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్, బీజేవైఎం నాయకులు యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ: రాజా బహదూర్ వెంకటరామరెడ్డి తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా ఔట్ డోర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అకాడమీలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ ఆవిర్భావం కోసం 1967 నుంచి ఎంతగానో కృషి చేశారన్నారు. ప్రజలో చైతన్యం నింపుతూ ఎన్నో పుస్తకాలను రచించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన వెన్నెముకగా నిలిచారని కొనియాడారు. ఆయన కృషి దార్శనికత వల్లే ఈరోజు రాష్ట్రం ఏర్పడి ఆ ఫలాలను ఆస్వాదిస్తున్నామన్నారు. అకాడమీ డీఎస్పీలు రాంబాబు, అమృతారెడ్డి, దేవారెడ్డి, భాస్కర్, కృష్ణప్రసాద్, జగదీష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, శ్రీను, శంకర్, ఫణీ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీవర్సిటీలో..

ఏజీవర్సిటీ: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను రాజేంద్రనగర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ చీనానాయక్, వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెంకటరమణ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ అకాడమీలో నివాళులర్పిస్తున్న ఔట్‌డోర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీరామమూర్తి



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

రాజేంద్రనగర్: ప్రజలంతా తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ కౌన్సిల్ విప్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ఆదివారం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఎస్ఈతో కలిసి ప్రతి ఆదివారం 10.10 నిమిషాలకు తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలంతా ప్రతి ఆదివారం 10 గంటలకు పది నిమిషాల పాటు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని వినూత్న కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తమ ఇంటి పరిసరాల్లో ఉన్న పూల కుండీలు, నిల్వ ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ జె.విశాల్, ఎస్.ప్రభాకర్, శ్రీనివాస్, జనార్దన్ ఉన్నారు.

ఓటరు నమోదు కేంద్రం పరిశీలన



రాజేంద్రనగర్: యువతీయువకులకు ఓటు విలువలు తెలుపుతూ.. ఓటరు నమోదు చేయిస్తున్నామని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్దగౌనీ భాస్కర్‌గౌడ్ తెలిపారు. అత్తాపూర్ డివిజన్ ఖయాంనగర్‌లో ఆదివారం ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లున్న వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించారు. ఈ ఉచిత ఓటరు నమోదు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉజ్మా షకీర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికా తదితరులున్నారు.

ఖయాంనగర్‌లో..

యువతీయువకులకు ఓటు విలువలు తెలుపుతూ.. ఓటరు నమోదు చేయిస్తున్నామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉజ్మా షకీర్ అన్నారు. అత్తాపూర్ డివిజన్ ఖయాంనగర్‌లో ఆదివారం ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయించారు. రాజ్యాంగం కల్పించిన హక్కును ప్రజలంగా ఉపయోగించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికా తదితరులున్నారు.

ప్రతి కాలనీకి కమ్యూనిటీహాల్ అవసరం



పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో స్థలం ఉన్న ప్రతి కాలనీలో కమ్యూనిటీహాల్‌ల నిర్మాణానికి కృషి చేస్తున్నామని ప్రజలకు అవి ఎంతో అవసరమని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులు వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ శైలజావినోద్‌కుమార్‌తో కలిసి ఆయన కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీలో పెరుగుతున్న ప్రజావసరాలు, ఖాళీ స్థలాలు లేకపోవడంతో సామూహిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు. వాటిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలలో కమ్యూనిటీహాల్‌లను నిర్మించాలని నిర్ణయించామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, ఏఈ సాయిమౌనిక, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంటారెడ్డి, నాయకులు శ్రీరాములు, జంగయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా సర్వీసు రోడ్డు

మణికొండ: గండిపేట్ మండల పరిధిలోని పట్టినాగులపల్లి శివారులో ఉన్న ఔటర్ సర్వీసు రోడ్డు పక్కన రాత్రి సమయాల్లో నిర్మాణ వ్యర్థాలు, మట్టి కుప్పలను తెచ్చి పోస్తున్నారు. వీటిని నెలలు గడిచినా అలాగే వదిలేయడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల పాలవుతున్నారు. ప్రతి నెల ఒకరు మృత్యువాత పడటం, అనేక ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. పట్టినాగులపల్లి, కొల్లూరు, ఇంద్రారెడ్డినగర్ తదితర గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా హెచ్ఎండీఏ అధికారులు స్పందించి రాత్రి సమయాల్లో మట్టి పోస్తున్న వాహనాలను సీజ్ చేయటం, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



ఔటర్ సర్వీసు రోడ్డుపై ప్రమాదకరంగా నిర్మాణ వ్యర్థాలు

దేవాలయానికి రోడ్డు వేయాలి



మంచిరేవులలో రోడ్డును పరిశీలిస్తున్న గ్రామస్తులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల మచిలేశ్వరాలయానికి ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి సీసీ రోడ్డు వేయాలని నార్సింగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎం. ప్రవీణ్‌యాదవ్ కోరారు. ఆదివారం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించి ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రతి సోమవారం దేవాలయానికి వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రతి ఏటా శివరాత్రికి లక్షకు మించి జనం దేవాలయానికి వస్తున్నారన్నారు. మరిన్ని మౌలిక సదుపాయాలు పెరిగితే దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వందల ఎకరాల దేవాలయ భూమి అన్యాక్రాంతం, ఇతరుల ఆధీనంలో ఉన్నా పట్టించుకోని అధికారులు ఓ విల్లా ప్రాజెక్టు వారి కోసమే రోడ్డును అడ్డుకోవటం సరికాదన్నారు. నాయకులు శ్రీనివాస్, కృష్ణభగవాన్‌రెడ్డి, ప్రవీణ్‌ముదిరాజ్, క్రాంతి గ్రామస్తులు పాల్గొన్నారు.

'భవిష్యత్తు కాంగ్రెస్ దే' !



మణికొండలో జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

మణికొండ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి పూర్వ వైభవం సంతరించుకుంటుందని మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎం. జితేందర్ అన్నారు. ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో మణికొండ మర్రిచెట్టు సర్కిల్, మణికొండ క్వార్టర్స్‌లలో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేసే క్రమంలో మున్సిపాలిటీ పరిధిలో జెండా పండగను నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి నుంచి వచ్చే ఎన్నికల వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికులుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ కౌన్సిలర్లు బి.పద్మారావు, కె.లక్ష్మీనారాయణ, నాయకులు ముత్యాలు, కిరణ్‌కుమార్, మాల్యాద్రినాయుడు తదితరులున్నారు.

'తమ స్థలంలోకి వచ్చి తమపైనే దాడి'

- ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామన్న పోలీసులు
- పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలిస్తామని స్పష్టీకరణ

రాజేంద్రనగర్: తమ స్థలంలోకి వచ్చి తమపైనే దాడి చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు తప్పుడు ప్రచారం చేయడం సరికాదని బుద్వేల్ గ్రీన్‌సిటీ ప్రాంతానికి చెందిన రమేష్‌కుమార్, కృష్ణారెడ్డి, కృష్ణ, సాజిత్‌లు వాపోయారు. తమకు సంబంధం లేని విషయంలో తప్పుడు ఫిర్యాదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బుద్వేల్ గ్రీన్‌సిటీలో వారు మాట్లాడుతూ.. బుద్వేల్ సర్వేనెంబర్ 528/2లోని రెండు ఎకరాల మూడు గుంటల స్థలం జహంగీర్ అలీపై ఉందన్నారు. వంశపారపర్యంగా 1950 నుంచి ఈ స్థలం ఉందని ప్రస్తుతం జహంగీర్ అలీ కుమారుడు మాజర్ అలీ పేరుపై పట్టా పాస్‌పుస్తకాలు, పహానీలతో పాటు ప్రభుత్వ అన్ని రికార్డులలో పేర్లు నమోదై ఉన్నాయన్నారు. ఈ స్థల విషయమై 2021 డిసెంబర్ నెలలో నాలా కన్వర్షన్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి పొందామన్నారు. స్థల సర్వేపై రాజేంద్రనగర్ ఎమ్మార్వోకు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోగా.. సర్వే చేసి హద్దులు నిర్ణయించి పంచనామా చేసి అనుమతిపత్రాలను అందించారన్నారు.

- తమ స్థలంలో శుక్రవారం మధ్యాహ్నం తాము ప్రహరీ పనులు చేపడుతుండగా.. రాజేందర్, నర్సింగ్, కిరణ్‌లతో పాటు వారి కుటుంబసభ్యులు వచ్చి పనులు అడ్డుకోవడంతో పాటు తమపైనే దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడిలో చేతికి పదునైన కత్తితో దాడి చేయడంతో ఉస్మానియా ఆసుపత్రిలో 11 కుట్లు వేశారన్నారు.
- తాము మజర్ అలీ నుంచి అగ్రిమెంట్ చేసుకుని ప్రహరీ గోడకు ప్రయత్నిస్తే తమపైనే దాడికి పాల్పడ్డారని తప్పుడు ప్రచారం చేస్తూ.. తమను మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తాము కూడా పూర్తి దస్తావేజులతో ఫిర్యాదు చేశామన్నారు. దాడి చేసిన వారిపై తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు.

పోలీసుల వివరణ...

- ఈ దాడి విషయమై రాజేంద్రనగర్ పోలీసులను వివరణ కోరగా.. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామన్నారు. స్థలానికి సంబంధించిన పూర్తి దస్తావేజులు తీసుకురావాలని సూచించామన్నారు. వాటిని పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు స్థలంలోకి ఎవరూ వెళ్లవద్దని ఎలాంటి పనులు చేపట్టవద్దని సూచించామన్నారు. మజర్ అలీ నుంచి అగ్రిమెంట్ చేసుకున్న వారు దస్తావేజులు సమర్పించారన్నారు. వాటిని పూర్తి స్థాయిలో పరిశీలిస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు ఫ్రెండ్‌షిప్‌డే సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వర దేవాలయం వద్ద 1993–94 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా సమావేశమై నాటి మిత్రులతో ఒకరికొకరు కలుసుకుని ఆనందంగా గడిపారు. పద్మారావు, కృష్ణ, పెంటయ్య, సాయిబాబా, ఆశీర్వాదం, రాజు, ప్రకాష్, జయంత్, కుమార్, భిక్షపతి, బాబురావు, శ్యామ్‌రావు, భాస్కర్‌రెడ్డి, హనుమంత్, వినోద్, శ్రీనివాస్, ఎండీ.సలీం, వెంకటేష్ తదితరులున్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అత్తగారింటి వద్దే ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజేంద్రనగర్: మద్యానికి బానిసైన భర్త అత్తగారి ఇంటికి వచ్చి భార్యను తనతో పంపాలని గొడవకు దిగాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్నావని పెద్దలను తీసుకొచ్చి మాట్లాడితేనే పంపిస్తామని చెప్పడంతో వెళ్లి అర్ధరాత్రి సమయంలో వారి ఇంటి గేటు వద్దే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ మేకగూడ ప్రాంతానికి చెందిన అంజనేయులు(35) డ్రైవర్. కాగా పదేళ్ల క్రితం బుద్వేల్ నాగులు చిన్న కుమార్తె రజనీతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. తాగుడుకు బానిసైన ఆంజనేయులు కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో పాటు భార్య రజనీని వేధిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులకు చెప్పింది. పెద్దల సమక్షంలో రాజీకి వచ్చిన భర్త మారకపోవడంతో రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. చివరకు తాను బుద్ధిగా ఉంటానని పెద్దల సమక్షంలో భార్యను తీసుకుని వెళ్లాడు. కొద్ది రోజులకే తిరిగి మద్యం తాగుతూ.. వేధిస్తుండటంతో ఆమె ఇద్దరు పిల్లలను తీసుకుని బుద్వేల్‌లోని తల్లిగారి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలోనే గొడవ జరిగి అర్ధరాత్రి సమయంలో అతడు ఇంటి గేటు ప్రహరీ వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు గంటల ప్రాంతంలో పక్కవారు గమనించి నాగులు కుటుంబానికి సమాచారం ఇవ్వడంతో వారు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గురుద్వారా స్థలాన్ని కాపాడండి



గురుద్వారా స్థలంలో చదును చేసిన దృశ్యం

రాజేంద్రనగర్: అత్తాపూర్ సిక్కు గురుద్వారాకు చెందిన స్థలంలో చదును చేస్తుండటంతో కమిటీ సభ్యులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. అత్తాపూర్ గురుద్వారా స్థలంలో గురుద్వారాను నిర్మించాల్సి ఉందని తెలిపారు. రోడ్డు పక్కన ఖాళీస్థలం ఉండటంతో పక్కనే ఉన్న వ్యక్తి తన స్థలంగా పేర్కొంటూ.. జీహెచ్ఎంసీ నుంచి ఇంటి నెంబర్‌ను పొందారన్నారు. ప్రభుత్వం సిక్‌చౌనీ ప్రాంతంలోని స్థలాన్ని గతంలో రెగ్యులరైజేషన్ చేసిందన్నారు. దీనిని ఆసరాగా తీసుకుని తన స్థలంగా పేర్కొంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో ఆర్డీఓ, ఎమ్మార్వో, కలెక్టర్‌లకు ఫిర్యాదులు చేశామన్నారు. గురుద్వార్‌కు చెందిన స్థలంలో ఎలాంటి పనులు నిర్వహించకుండా రెవెన్యూ అధికారులు స్పందించాలని కోరారు.

ప్రభుత్వం భూముల వేలం నిలిపేయాలి



రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ నేతల నిరసన



కోకాపేటలో పోలీసులతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి

బీజేపీ, బీఎస్పీ పార్టీలు వేర్వేరుగా నిరసనలు

రాజేంద్రనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు చెందిన అసైన్డ్ భూములను తీసుకుని హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో వేలంపాట వేయడాన్ని నిరసిస్తూ.. బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పిలుపు మేరకు రాజేంద్రనగర్ కేంద్రంలో ఆ పార్టీ నేతలు ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాచమల్ల జయసింహ మాట్లాడుతూ.. ప్రభుత్వం అర, ఒక ఎకరంలో ఉన్న పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన భూములను అన్యాయంగా ప్రభుత్వం తీసుకుని వేలం వేయటం సరికాదని ఇందులో ఎవరు లాభ పడుతున్నారని ప్రశ్నించారు.

- మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్, తెలంగాణ ఉద్యమం సమయంలో 'ప్రభుత్వ భూములు అమ్మొద్దు' అని ప్లకార్డుల ప్రదర్శన చేసి ప్రస్తుతం హెచ్ఎండీఏ ప్రభుత్వ భూములను వేలం వేయడం వెనుక ఉన్న రహస్యం ఏమిటో ప్రజలకు తెలియజేయాలన్నారు.
- కోకాపేట భూములను అమ్మిన ప్రభుత్వం ఇప్పుడు బుద్వేల్ భూములను అమ్మటానికి రంగం సిద్ధం చేయటాన్ని బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ చర్యలను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను రైతులకు పట్టాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల బహుజన సమాజ్ పార్టీ దీనిపై పోరాటానికి ప్రణాళిక సిద్ధం చేసి పోరాడుతుందని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఈస్ట్ జోన్ అధ్యక్షుడు లింగం, రంగారెడ్డి జిల్లా వెస్ట్ జోన్ అధ్యక్షుడు రాచమల్ల జయసింహ, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి సుల్తాన్ రఘు, కార్యదర్శి విభాగ అధ్యక్షుడు మల్లగళ్ల యాదగిరి, చేవెళ్ల ఇన్‌చార్జి కృష్ణ, రాజేంద్రనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు యాదగిరి, ఉపాధ్యక్షుడు రాచమల్ల రాజ్‌కుమార్, అసెంబ్లీ కోశాధికారి హైదర్‌గూడ సాయికుమార్, అసెంబ్లీ కార్యదర్శి రవికుమార్, రాజేంద్రనగర్ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు దుర్గా శివదాస్, ఉపాధ్యక్షులు చింతకుంట మహేష్, మున్సిపల్ కార్యదర్శి దశరథ్, మహిళా కన్వీనర్ స్వప్నజైరాజ్, షాద్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, ఇతర మండల నాయకులు దొమహరి, తుప్పరి కుమార్, విక్రమ్‌రాయ్, అనంతరాములు, నరసింహయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

మణికొండ: జిల్లాలోని ప్రభుత్వ భూములను ప్రజావసరాలకు ఉంచకుండా వేలాలు వేయటాన్ని బీజేపీ పూర్తి స్థాయిలో ఖండిస్తుందని, ఇకనైనా భూ వేలాలను వెంటనే నిలిపివేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక పార్టీ నాయకులు ఇటీవల కోకాపేటలో వేలం వేసిన భూములను పరిశీలించేందుకు వెళ్లారు. వారిని ఔటర్ సర్వీసు రోడ్డుపైనే అరెస్టు చేసి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గండిపేట మండల పరిధిలోని ప్రజలకు శ్మశానాలు, కళాశాలలకు, ఆసుపత్రులు, పార్కులు, ప్రజలకు నివాసస్థలాలు తదితర ప్రజల అవసరాలకు భూములు కేటాయించకుండా ఇష్టానుసారంగా అప్పులు చేసి, సాధ్యపడని హామీలు ఇచ్చి ప్రభుత్వ భూములను అమ్మటం సిగ్గుచేటన్నారు.

- గండిపేట మండల పరిధిలో విపరీతంగా జనాభా పెరుగుతుందని, భవిష్యత్తు తరాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు భూములు లేకుండా చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈనెల 10న మరోసారి బుద్వేల్ భూములను ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని, వాటిని తమ పార్టీ తరపున అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కోకాపేట భూములను పరిశీలించేందుకు సైతం తమకు అవకాశం ఇవ్వని పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

ప్రజావసరాలకు కేటాయించాలి...

- రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు ఏమాత్రం సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే ప్రశ్నించలేదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంజన్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. భవిష్యత్తులో మరోమారు ప్రభుత్వ భూములను వేలం వేస్తే తమ పార్టీ తరపున పూర్తి స్థాయిలో అడ్డుకుంటామన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు సీ.హెచ్. బిక్షపతియాదవ్, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు ఎం.నాగేష్‌యాదవ్, పీఎస్. మల్లారెడ్డి, శివరాజు, బుచ్చిరెడ్డి, నర్సయ్యచారి, జైపాల్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాసచారి, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.